


# నిచ్చెనమెట్లు

కప్పగంతుల మల్లికార్జునరావు


ఆ వేళ దినపత్రిక చదువుతూండగా రంగమ్మకు మెరుపులా వో ఆలోచన వచ్చింది. కావడితో నీళ్ళు తెస్తున్న తమ్ముడు నరసింహాన్ని పిల్చి ఆ ఆలోచన చెప్పింది. అతడు వింటూనే పొగడ్త లంకించుకొన్నాడు.

రంగమ్మ సర్వీసులో వున్నప్పటి నుంచీ పేపరు చదవటం, రాజకీయాలు చర్చించటం అలవాటు. అంచేత తనో గొప్ప మేధావినని మహా గర్వపడి పోతుంటుంది.

రంగమ్మలో 'ఈగో' ఎంత శక్తివంతమైనదంటే, మొగుడు చనిపోయినప్పుడు 'శలవుదొరక్క' చూడటానికి వెళ్ళలేక పోయానని ఆమె యిప్పటికీ చెప్పుకొంటూ ఉంటుంది. అయితే, చదివి, వుద్యోగం చేస్తున్నానన్న గర్వంతో మొగుడితో ఆమె సరిగా కాపురం చేయలేదని ఆ ఊళ్ళో చాలా మందికి తెల్సు.

ఆమెకు తమ్ముడన్నా, అతడి సంసారమన్నా తగని అభిమానం. అయితే నరసింహానికి- గాలి కబుర్లు చెప్పటం, కొట్లాటలు పెట్టుకోటం, పిల్లల్ని కనటం, నీళ్ళు మొయ్యటం అక్కను పొగడటం తప్ప మరే పనీ చేతకాదు.

"అయితే అక్కా! మనూళ్ళో మహిళా మండలి పెట్టబోతున్నట్లు వూళ్ళో అందరికీ చెప్పిరానా?"




కథా నిలయం
శ్రీకాకుళం

"ఉండరా!" అంటూ మహా మేధావిలా పోజు పెట్టింద. "నేను శేషమ్మతో యీ విషయం మాట్లాడటానికి వెళ్తాను. సరిగ్గా ఆ సమయంలో మనం మహిళా మండలి పెట్టబోతున్నట్లు ప్రచారం చెయ్యి" అంది.

* * *

శేషమ్మ అని పిలవబడే శేషారత్నం విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు భార్య.

శ్రీమన్నారాయణతో ఏ చిన్న పని కావాలన్నా శేషమ్మను దర్శించి ముడుపు చెల్లించుకోవాల్సిందే. శేషారత్నం కార్యశీలి. బిజినెస్ మైండ్. పైసా లాభం వుందనుకొంటే కమ్మగా మాట్లాడుతుంది. లేకపోతే కస్సున లేస్తుంది.

రంగమ్మ మహిళా మండలి ఆలోచన వినగానే శేషమ్మ లాభనష్టాలను బేరీజు వేసుకొంది. ఆ ఆలోచన ముందుగా తనకు రానందుకు తిట్టుకుంది. "ఎందుకొచ్చిన గొడవల్లేమ్మా? అయినా పిల్లాజల్లా, ఆయనగారి కోసం వచ్చే పోయే అతిధులు-నాకు తీరికెక్కడుంటుంది?" అంటూ బెట్టు చేసింది.

శేషమ్మ బెట్టు చేస్తున్నదని రంగమ్మకు తెల్సు. అయినా ఆవిడను మహిళా మండలిలో,

దానికి అనుబంధంగా ఏర్పాటు చేసే మహిళా కోపరేటివ్ సొసైటీలో చేర్చుకొంటే శ్రీమన్నారాయణ కొన్ని పనులు చేసి పెడ్తాడని ఆశ.

"నువ్వూ నేను వొకటయ్యాక యింక గొడవ లేముంటాయి శేషమ్మా? నా శక్తి నీకు, నీ శక్తి నాకు తెలవదా?"

గ్రామంలో మోతుబరి రైతుల స్త్రీలు యిలాంటివి పట్టించుకోరు. కూలీ నాలీ చేసుకు బ్రతికే స్త్రీలకు యిన్ని ఆలోచనలు లేవు. వున్నా నిర్వహణ సామర్థ్యం లేదు. అంచేత వూళ్ళో చిన్న నుంచి పెద్ద దాకా స్త్రీలకు సంబంధించిన వ్యవహారాలు వీళ్ళద్దరి చేతి మీదుగానే నడుస్తుంటాయి.

మొత్తం మీద యిద్దరి మధ్యా బేరాలు కుదిరేయ్. స్థాపించబోయే మహిళా మండలికి, సొసైటీకి- శేషమ్మ అధ్యక్షురాలు, రంగమ్మ కార్యదర్శి. మిగతా మెంబర్లను కూడా వాటాల వంతున తమ వాళ్ళనే నిర్ణయించుకొన్నారు కూడా.

"సభ్యత్వాన్ని వెనకబడ్డ తరగతుల వాళ్ళకే పరిమితం చేస్తే బాగుంటుంది శేషమ్మా! లేకపోతే మనం యింత కష్టపడ్తే, చివరికి మోతుబరి రైతులో, లేకపోతే అలగా జనమో లాభాలని తన్నుకు పోతారు. ఏమంటావు?"

రంగమ్మ ఆలోచన శేషమ్మకూ నచ్చింది. "అసలు వెనకబడ్డ తరగతులవారి మహిళా కోపరేటివ్ సొసైటీ అని పేరు పెడ్తే సరి పోలా?" అంటూ తన వంతు సలహా యిచ్చింది. రాజ్యాంగాన్ని తయారు చేయటంలో తగు సలహాలను శ్రీమన్నారాయణ నుంచి అర్థించటానికి నిర్ణయమయింది. శ్రీమన్నారాయణ కష్టపడి రాజ్యాంగాన్ని తయారుచేసేడు. రంగమ్మ సొసైటీవల్ల జరగబోయే లాభాలను బడిపంతుల్లా బోధించి సభ్యురాళ్ళను చేర్పించింది. శేషమ్మ తన 'ఇన్‌ఫ్లూయన్స్' వుపయోగించి చేర్పించింది.

కొద్ది రోజుల్లోనే మహిళా మండలికి, సొసైటీకి గుర్తింపులు లభించాయి. కుట్టు మిషన్లుకొనుక్కోటానికి, అప్పడాల పరిశ్రమను స్థాపించుకోటానికి, గేదెలు, కోళ్ళ పెంపకం యిత్యాది వాటికి కొందరు సభ్యులకు లోన్లు శాంక్షన్ అయ్యాయి కూడా.

అప్పటి దాకా 'ఏమిటోలే' అని వుదాసీనత వహించిన జనానికి, లోన్లు కూడా శాంక్షను కావటంతో సంచలనం వచ్చింది. సభ్యులుగా చేరతామని పోటీలు పడ్డారు. కానీ సభ్యత్వం వెనకబడ్డ తరగతుల

వారికే అని తెలిసి, అటు రైతు కుటుంబాలవారు, యిటు మాలపల్లె, మాదిగవాడల్లో కూలీలు నిరాశ చెందేరు. సభ్యులు కావటానికి కొందరు కొత్త మార్గాలు అన్వేషించారు.

హరిజనవాడలో కర్రి రాముడు నరసింహానికి మంచి స్నేహితుడు. అతడి చెల్లెలికీ, నరసింహానికి ఏదో వ్యవహారం వుందన్న పుకారు కూడా వుంది.

"అక్కా! కర్రి రాముడు చెల్లెలు సొసైటీలో సభ్యత్వం కావాలని చంపుతోందే! చేర్చుకోవూ?"

"ఎలారా? మా రాజ్యాంగం అందుకు వొప్పుకోదే!"

"నువ్వు తల్చుకొంటే రాజ్యాంగాలు ఏమి అడ్డొస్తాయే అక్కా? అసలు మహిళామండలి స్థాపకురాలివే నువ్వు కదా?"

తమ్ముడు వుబ్బగొట్టగా వుబ్బగొట్టగా, రంగమ్మ భ్రాతృప్రేమ కొద్దీ మెత్తపడింది.

అదే సమయంలో గ్రామ సర్పంచ్‌గారి ఉంపుడుగత్తె సభ్యురాలుగా చేరాలని సర్దా పడింది. సర్పంచ్ గారంటే శ్రీమన్నారాయణకు గౌరవం భయం. పైగా సర్పంచ్‌గారు తన ఉంపుడుగత్తెను సభ్యురాలుగా చేర్చుకొంటే శ్రీమన్నారాయణకు ఏమేమో చేస్తానని ఆశ పెట్టేడు. ఉంపుడుగత్తె శేషమ్మకు స్వయంగా వచ్చి లంచం యిచ్చింది కూడా.

రంగమ్మ సొసైటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, హరిజనులకి కూడా సొసైటీలో కొంత శాతం సభ్యత్వాన్ని యివ్వాలన్న ప్రతిపాదన చేసింది. "యివాళ ప్రభుత్వం హరిజనులకి ఎన్నో సౌకర్యాలు చేస్తోంది. వాళ్ళ పేరు చెప్తేనే గ్రాంటు లొస్తున్నాయి. న్యాయానికి వాళ్ళూ మనలాగే బీదవారు కదా! అంచేత వాళ్ళను సభ్యులుగా చేర్చుకొంటే మనకూ లాభం, వారికీ లాభం అని, అనుభవజ్ఞురాలిని గనుక, యివాళిటికీ పత్రికలు చదివి రాజకీయాల్ని ఆకళింపు చేసుకొనేదాన్ని గనుకా, ముందు చూపుతో యీ ప్రతిపాదన చేస్తున్నా. సభ్యులంతా అంగీకరిస్తారని నా నమ్మకం."

శేషమ్మ రంగమ్మ ప్రతిపాదనకు అభ్యంతరం చెప్పింది.

"మనకన్నా బలహీనుల్ని చేర్చుకొంటే మనకేం లాభం? సొసైటీ అభివృద్ధి చెందాలంటే పలుకుబడి వున్న వర్గాల వారిని చేర్చుకోవాలి. అంచేత అండదండలు లభించే

అగ్ర కులాలవారికి కూడా సంఘంలో కొంత శాతం సభ్యత్వం యివ్వాలని నా ప్రతిపాదన."

అలా రంగమ్మ, శేషమ్మ క్షణంలో ప్రత్యర్థు లయ్యారు. మాటల్తో కొంతసేపు యుద్ధాలు చేసుకొన్నారు. ఆ తర్వాత జుట్టూ జుట్టూ పట్టుకొన్నారు.

"నిన్ను కార్యదర్శి పదవిలో నుంచి పీకేస్తున్నా" అని అరచింది శేషమ్మ.

"బోడి- నువెవతివే? సొసైటీ స్థాపకురాలిని నేను. సొసైటీ నాది. నిన్ను ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలిగిస్తున్నా" అంటూ రంగమ్మ సింబాలిక్‌గా వో చిత్తు కాగితాన్ని చించి పారేసింది.

రంగమ్మకు హరిజనులు మద్దతు నిచ్చారు. శేషమ్మకు పెద్ద కులాల వారు అండగా నిలిచేరు.

రంగమ్మ 'నిరంకుశ ధోరణి'ని శేషమ్మ దుయ్యబట్టింది.

శేషమ్మ వర్గాన్ని 'అభ్యుదయ నిరోధకులుగా, పెత్తందార్లుగా, కుల పిచ్చి, మతోన్మాదం' గల వారిగా అభివర్ణించి ఘాటుగా విమర్శించ సాగింది రంగమ్మ. పరస్పరం 'లంచగొండులు', 'అవినీతిపరులు' అని నిందించుకొన్నారు.

సభ్యుల సంతకాలు సేకరించి, వొకరికి వ్యతిరేకంగా మరొకరు కలెక్టరుకు, తదితర అధికారులకు పిటీషన్లు పంపేరు.బస్తీలో ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు.

* * *

మిస్ కమలనయనముఖర్జీ చిన్న తనం నుంచి వున్నత భావాలు కలిగినటువంటిది. ధనవంతుల బిడ్డ. అయినా సేవా దృక్పథంతో కలెక్టరయింది. రంగమ్మ, శేషమ్మలు పెట్టిన పిటీషన్లు ఇంగ్లీషులోకి తర్జుమా చేయించు కొని చదివి, అందులో వుపయోగించిన పెద్ద పెద్ద పదాలకు ఆశ్చర్య పోయింది.

"ఇదేమన్నా కులాల, మతాల తగాదా?"

"నో మేడం! ఇటీజ్ ఎ పెట్టీ క్వారల్" పి.ఏ. అన్నాడు. అయినా ఆమె విషయాన్ని స్వయంగా పరిశీలించటానికి ఆ వూరికి మెరుపు తనిఖీ వేసుకొంది.

* * *

చెరువు గట్టుమీద కూర్చొని గాలి కబుర్లు చెప్తున్న నర సింహం, నీళ్ళు పట్టుకోటాని కొచ్చిన శేషమ్మను చూచి, "ఆ శేషమ్మకు గ్రామ సర్పంచ్ అంటే అంత ప్రేమ ఎందుకో?"

అన్నాడు- శేషమ్మకు వినిపించా లన్నట్లుగా.

అది విన్న శేషమ్మ కలకత్తా కాళి అయింది. "కర్రి రాముడి చెల్లెలంటే నీ కెందుకంత ప్రేమ?" అంటూ అతడిని, రంగమ్మని కలిపి పురాణాలు వల్లించింది. ఎక్కడినుంచో వచ్చిన కర్రి రాముడు శేషమ్మ మాటల్లో తన పేరు, తన చెల్లెలి పేరు విని ప్రళయకాల రుద్రుడయ్యాడు.

"ఏమిటే ముండా! నా చెల్లెలికి రంకు అంటకడ్తావా?" అంటూ శేషమ్మ మీద చెయ్యి చేసు కొన్నాడు.

భార్య మీద చెయ్యి చేసుకోటం అల్లంత దూరం నుంచి చూచిన శ్రీమన్నారాయణ రేసు కుక్కలా కర్రి రాముడివైపు పరుగెత్తేడు. మరో వైపునుంచి గొడవ విని వస్తున్న రంగమ్మ తిట్లతో అతడిని అటకాయించింది. కోపం పట్టలేక శ్రీమన్నారాయణ రంగమ్మను క్రింద పడేసి జుట్టు పట్టుకొని లాగేడు. అది చూచి నరసింహం శ్రీమన్నారాయణ మీదికి పులిలా లంఘించి చితకబాదేడు. ఇంతలో సర్పంచ్ మనుషు లొచ్చి నర సింహం తల పగలగొట్టేరు.

మెరుపులా అంతా క్షణంలో జరిగిపోయింది. రంగమ్మ తమ్ముడి మీదపడి ఏడుస్తూ అవతల వర్గం వారిని శాపనార్థాలు పెట్టసాగింది. పెడ్తోండగా ఆమెకో గొప్ప


## మనవి

'విజయ'లో వచ్చే సంచికనుండి 'పాఠకుల ఉత్తరాలు' శీర్షికను తిరిగి ప్రవేశపెడుతున్నామని తెలియజేయుటకు సంత సిస్తున్నాము.

—ఎడిటర్

అడ్రస్ :

**'విజయ'**

**80-ధనలక్ష్మీ కాలనీ,**

**మద్రాసు-600 026.**

ఆలోచన వచ్చింది. క్షణంలో కర్రి రాముడు తన జనాన్ని పోగు చేసేడు.

రెండెడ్ల బండి మీద మంచం వేసి స్పృహ తప్పి వున్న నరసింహాన్ని పడుకోబెట్టేరు. పక్కనే వో కుర్చీలో రంగమ్మ కూర్చొంది. జయజయధ్వానాలు, 'డౌన్-డౌన్' లతో వూరేగింపు బస్తీకి బయలు దేరింది.

"మతోన్మాదులు, కులశక్తులు నశించాలి!"

"భూస్వాముల దౌర్జన్యం- డౌన్ డౌన్!"

"లంచగొండులను, అవినీతి పరులను- నిర్మూలించాలి!"

"శేషమ్మా- డౌన్ డౌన్! రంగమ్మా- జిందాబాద్!"

బస్తీ సగం దూరంలో వుండగా కలెక్టర్ జీపు ఎదురయింది. కలెక్టరమ్మకు జిందాబాద్ లు చెప్పారు గుంపు. ఆ తర్వాత రంగమ్మ వచ్చీరాని ఇంగ్లీషులో వుద్రేకంగా తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పింది, తమ్ముడిని చూపింది.

మిస్ కమలనయన గ్రామం లోకి వెళ్ళి పరిస్థితిని స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తానంది. అప్పటి కప్పుడు, అక్కడికక్కడ న్యాయం కావాలని అరిచారు. కలెక్టరు వూళ్ళో కెళ్ళకుండా 'ఘెరావో' చేసేరు. ఉద్రేకాన్ని రెచ్చగొట్టటం యిష్టం లేక కలెక్టరు బస్తీకి తిరిగి వెళ్ళింది.

నాలుగు రోజుల తర్వాత అసుర సంధ్యవేళ నీళ్ళకై వెళ్తూ శేషమ్మ కాలుజారి మెట్ల మీద పడింది. కాలు బెణికింది. తలకు స్వల్పంగా గాయ మయింది.

తెల్లవారే సరికి, శేషమ్మ మీద హత్యా ప్రయత్నం జరిగిందన్న వార్త వూరంతా మోగిపోయింది. అంత ఘాతుకాన్ని తలపెట్టింది కర్రి రాముడు. ఆమె వర్గం వారిలో ఆవేశాలు పెరిగేయి.

పాతిక ఎడ్ల బండ్లతో సహా పెద్ద వూరేగింపు బస్తీకి బయలు దేరింది. ముందు బండిలో కట్టు కట్టిన కాలును, తలను ప్రదర్శిస్తూ శేషమ్మ వున్నతాసనంపై కూర్చుంది. బాధను, ఏడ్పును నటిస్తోంది.

"రంగమ్మ నిరంకుశత్వం-నశించాలి!"

"అవినీతి, ఆశ్రిత పక్షపాతం- అంతరించాలి!"

"రంగమ్మా- డౌన్ డౌన్! శేషమ్మా- జిందాబాద్!"

వూరేగింపు కలెక్టర్ ఆఫీసుకు చేరుకుంది.

(మిగతా కథ 86వ పేజీలో)

(నిచ్చెన మెట్లు ............ 16వ పేజీ తరువాయి)

కలెక్టరు కమలనయన ఆఫీసు నుంచి బయటికొచ్చి శేషమ్మను పరామర్శించి, న్యాయం చేస్తానని అభయమిచ్చింది.

నరసింహం, శేషమ్మ వొకే హాస్పిటల్లో, వొకే వార్డులో వుండటం వల్ల కొట్లాటలు అక్కడికీ విస్తరించాయి. కలెక్టర్ మహిళా సొసైటీని రంగమ్మకే దాఖలు పర్చబోతున్నదన్న పుకారు కొన్నాళ్ళు రాజ్యమేలింది. ఆ తర్వాత శేషమ్మ పక్షాన ఆర్డర్సు పడ్డట్టు చెప్పుకొన్నారు.

మిస్ కమలనయన రంగమ్మను, శేషమ్మను విడి విడిగా పిలిపించి, కోపరేటివ్ సొసైటీ వల్ల గ్రామాభ్యుదయం ఎలా జరిగేదీ వివరించి, యిరువురికి రాజీ కుదర్చాలని ప్రయత్నించింది. అయితే యిరువురు ఉడుం పట్టు పట్టేరు, తమకు మాత్రమే సొసైటీని దాఖలు పర్చక పోతే అసలు వూళ్ళో సొసైటీ వుండటానికే వీల్లేదన్నారు. అలాగని రాసిచ్చారు కూడా.

* * *

మిస్ కమలనయన ఆ కేసుతో విసిగిపోయింది. పైలుకు డిస్పోజల్ యిచ్చేసింది.

'రంగమ్మ, శేషమ్మల కోరిక మీద మహిళా మండలికి, దాని అనుబంధ సంస్థ అయిన మహిళా సొసైటీకి యిచ్చిన గుర్తింపు, మంజూరు చేసిన గ్రాంట్సు ఉపసంహరించుకోవటమైనది. ముందు ముందు గ్రామ ప్రజలంతా సమిష్టిగా కోరినట్లయితే ప్రభుత్వమే సహకార సంఘాన్ని నియమించాలి. ఫలానా గ్రామప్రజలు- సహకార సంఘాన్ని, ప్రజాస్వామ్య పద్ధతుల్ని విస్మరించి ప్రవర్తించేరు కనుక వారికి అలాంటి బాధ్యతలని ముందు ~~ముందు అప్పజెప్పె~~టప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోటం అవసరం.'

స్టెనో ఆర్డర్ని పైపు చేసుకు రావటానికి వెళ్ళేడు. మిస్ కమలనయన భారంగా కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలింది.

ఆ గ్రామం- తాలూకా- జిల్లా- రాష్ట్రం- దేశంగా మారింది ఆమె మనోనేత్రంలో. దేశంలో ఎంత మంది శేషమ్మలో? రంగమ్మలో?

పైనుంచి క్రింది వరకు ఓ పెద్ద నిచ్చెన! మెట్టు మెట్టుకు పైన కుర్చీలు. ఆ కుర్చీలు పట్టుకు వ్రేలాడే వాళ్ళు కొందరు. మెట్టు

పట్టుకొని పాముల్లా వేళ్ళాడుతూ పైకి ప్రాకాలని ప్రయత్నించే వాళ్ళు కొందరు! పై మెట్టు మీద కుర్చీలో వున్నవాళ్ళ మాటల్ని క్రింది వారూ అరుస్తున్నారు. అంతా అల్లకల్లోలం!

'యధా నాయకః తధా ప్రజః! యధా పాలకో తధా ప్రజః!'

"మేడమ్!"

కళ్ళు తెరిచి స్టెనో టేబిల్ మీద పెట్టిన వైపు కాగితాలు చూచింది. అన్ని వాక్యాలలో ఒకే ఒక పెద్ద భావం!

'ఎటు పోతోంది దేశం? ఎవరు రక్షిస్తారు యీ జనాన్ని?'

ఆ ప్రశ్నల క్రింద పచ్చ యింకుతో సంతకాన్ని చేసింది మిస్ కమలనయన! *


విజయ

వచ్చే సంచికలో ప్రారంభం!

మహోజ్వల చారిత్రాత్మక సీరియల్!

ప్రసాద్ రచన...

సామ్రాట్ శైలేంద్రగౌతమ

నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి!